కథానిక

# విఫలంగాని విజిట్

"రత్నం"

దుమ్ము రేపుకుంటూ ఎదురుగా పరుగెత్తుకొస్తోంది జీపు. 'స్పెషల్ ఆఫీసర్.. డిస్ట్రిక్టు బోర్డ్'— తెల్లటి ఇంగ్లీషు అక్షరాలు మిలమిలా మెరుస్తూ జిగేల్...జిగేల్ మన్నయ్ ఎండలో.

"ఈ దెబ్బతో గోపాలసామి గో...యిందా! సినిమా పడికట్టు పదంతో 'డేంజర్ సిగ్నల్' ఇచ్చాడు నారాయణ. ఎండకు కప్పుకున్న ముసుగుల్ని ఇంకొంచెం ముందుకు లాక్కొని అందరూ రోడ్డు ప్రక్కనే ఉన్న ఆంజనేయస్వామి గుడి చాటుకు తప్పుకున్నారు అపాయాన్ని గ్రహించి.

"ఇవ్వాళే రావాలీ యీ యముడు ... మన ప్రాణంమీదికి!— జీపు మొఖాన గొట్టి పోయిన దుమ్ములో ఉక్కిరి బిక్కిరి అవుతూ...ప్రోగ్రాం విఫలమైనందుకు అదృష్టాన్ని తెగతిట్టుకున్నాడు దాసు. "ఈవారం టూర్ మానేద్దామంటేవిన్నారూ. ఎవరు చేసిన ఖర్మ వారనుభవించక...." తత్వోపదేశంలో ఎత్తిపొడిచాడు శాస్త్రి.

"ఆపద్బాంధవా ... అనాథ రక్షకా ... ఆంజనేయా!"—అందరి తరఫునా చేయెత్తి మ్రొక్కేడు దేవుణ్ణి నారాయణ...నాటకం ఫోజుపెట్టి. ఆ గుళ్ళో దేవుడు సామాన్యుడు గాడు. ముమ్మారు ప్రదక్షిణం చేసి, ఓరోజు ప్రాణాచారం పడితే చాలు, 'పిల్లలు' పుడతారని ఎక్కడెక్కణ్ణుంచో తరలివస్తారు సంతాన హీనులు, ఆ 'వీరాంజనేయస్వామి' దర్శనానికి.

అంతలావు పవర్ గల ఆ రాతి కోతిబొమ్మ మనల్ని మాత్రం యెందుకు రక్షించదు...భయపడకండని మిత్రులందరి వీపు తట్టి బయల్దేరదీశాడు నారాయణ.

నిప్పులు చెరుగుతున్న ఎండలో...పెనంలో వేయించినట్టున్న దుమ్ములో బడి రెండుమైళ్ళు వాళ్ళు వెనక్కిపోవాల్సి వచ్చినందుకు, తనిఖీకి వచ్చిన అధికారిని తిట్టుకొంటూ...ఏమవుతుందోనని అనర్థాన్ని శంకిస్తూ వచ్చిన త్రోవ బట్టారు ముగ్గురూ.

జిల్లాలో ఓ కొసనున్న మారుమూల స్కూలు అది. కొలంబస్ యాత్ర చేసి...నాలుగు మైళ్ళల్లో కారు దిగి రావాలి ఆ వూరు. ప్రపంచానికి నాలుగు రోజులు వెనక ఉంటుంది ... పత్రికలూ ఉత్తరాలూ చేరే ప్రకారం చూస్తే. ఆ సద్దికబుర్లతో జీవం లేకుండా ఉంటుంది అక్కడి వాతావరణం.

నిందితుల్ని అండమాను దీవులకు పంపినట్టు... పనిష్మెంట్ క్రింద బదిలీ చేయబడతారు పంతుళ్లు ఆ స్కూలుకు. పెర్మనెంట్ వాళ్ళయితే ఓరోజుండి సెలవుబెట్టి చక్కా పోతుంటారు, ఇంకోచోటికి మారేదాకా. వాళ్ళమీద బనాయించబడే కేసులు గమ్మత్తు గమ్మత్తుగా ఉంటాయి.

విత్ డ్రా చేసిన స్పెషల్ ఫీజుల డబ్బు ఎనిమిదోరోజు కూడా దగ్గరే ఉంచుకొన్నాడట! మేనేజిమెంటు అనుమతి లేకుండా పత్రికలకు కథలు పంపేడట! జీతాలు తగ్గించమని పిల్లలు చేసిన సమ్మెలో సంబంధం ఉన్నదని అనుమానమట!'—ఆ ఆరోపణల్లో మచ్చు తునకలివి. ఇక అవిధేయత చూపించాడనీ, పరీక్షల్లో కాపీలందించాడనీ, చదువు సరిగ్గా చెప్పడనీ, ఘోరమైన కమ్యూనిస్టనీ—ఇట్లా రకరకాల కారణాల్తో జిల్లా నలుమూలల్నుంచి అక్కడికి బదిలీ చేయబడతారు పంతుళ్లు. పలుకుబడి గలవాళ్ళకి ఖాళీ కావాల్సి వచ్చిందనీ, లంచాల పోటీలో నెగ్గలేకపోయామనీ, గుమాస్తాల మామూళ్ళు చెల్లించలేదనీ—కొత్తగా ట్రాన్స్ఫర్ అయిన వాళ్ళంతా గొణుగుతుంటారు సర్వసామాన్యంగా.

ఇక ఆ స్కూల్లో సెలవు పెట్టటానికి వీల్లేని కొత్తగా అపాయింట్ అయిన పంతుళ్ళు ఇంకో ఉద్యోగం దొరికేదాకా కాలక్షేపానికి వచ్చే గ్రాడ్యుయేట్లూ నిలవ ఉంటారు. సంవత్సరం పొడుగునా నిత్యనూతనంగా కొత్త మొగాల్ని చూస్తూ బళ్ళోకి వచ్చి పోతుంటారు పిల్లలు.

ఎట్లాగో రోజులు వెళ్ళబుచ్చటానికి, ఓ వెంకాయమ్మని వెతుక్కొని, ముప్పై ఫరూపాయల్తో

గోంగూర పచ్చడి మెతుకుల్తో, బళ్ళో బల్లలమీద కాలం గడుపుతారు పంతుళ్ళు. ప్రతి శుక్రవారం సినిమాకో... స్వంత ఊరికో ఎక్కడికైనా సరే బయల్దేరటం, సోమవారం సాయంత్రానికి మెల్లగా తిరిగి వచ్చి...రెండు పూటలా సంతకాలు పెట్టుకోవటం ఆ స్కూలు సంప్రదాయం. హెడ్మాష్టరు కూడా బిల్లు చేయబోయేప్పుడు ... నెలచివర ... పొరపాటున ఎక్కడన్నా ఖాళీ కనిపిస్తే లీవు మార్కు చేస్తుంటాడు.

సినిమాకని బయల్దేరిన నారాయణ, శాస్త్రి, దాసూ—ఆ రోజు ప్రొద్దున్నే లేచి ఎవరి మొహం చూశారో, పొలిమేర దాటకుండానే తిరిగి రావాల్సి వచ్చింది.

నారాయణ స్కూల్లో ప్రతి పక్షనాయకుడు. యస్. యస్. యల్. సి. రిజిష్టరు చూస్తూ 'మార్చి, అక్టోబరు-మార్చి, అక్టోబరు-నాలుగు సార్లు దండయాత్ర చేసి, వ్యాయామ శిక్షణలో ఆరితేరి వచ్చావా నాయనా!'-అని హెడ్మాష్టరు వామనరావు చేసిన పరిహాసానికి కక్షగట్టి ఎదురునిల్చాడు ఆ డ్రిల్లుపంతులు.

ప్రక్క క్లాసులో పిల్లల్ని గొడ్డును బాదినట్టు బాదుతోంటే 'గాడిద నెక్కాల్సినవాడు కుర్చీ యెక్కేడు... గుడ్డలు ఉతకాల్సినవాడు పిల్లల్ని ఉతుకుతున్నాడు' అని తను విన్నేట్టే కులం పేరు ఎత్తి వ్యాఖ్యానించేసరికి ప్రతి పక్షంలో ఉపనాయకుడుగా చేరేడు ఫస్టు అసిస్టెండు దాసు.

'నిద్రపోవటానికి కాదయ్యా జీతం డబ్బులు పుచ్చుకొనేదీ!'-అరగంటనుంచి చూసిచూసి సహించలేక కుర్చీలో గుఱ్ఱు కొడుతున్న శాస్త్రిని లేపేసరికి... అతడూ వామనరావుకు వ్యతిరేకంగా ప్రతిపక్ష సలహాదారుగా చేరేడు.

"అసలే తామంటే పడటంలేదు...ఏం చాడీలు చెప్తాడో దుర్మార్గుడని' హెడ్మాష్టరుమీద అనుమానంకొద్దీ దడదడలాడుతూ...సినిమా ప్రయాణం మానుకొని...రోడు తీసుకొచ్చారు ఆ పంతుళ్ళు.

• • •

త్రాగేత్రాగే కాఫీ కిందబెట్టి బస్సీ మీద పైపంచ గప్పుకొని...గూడకట్టుతో ఆదరాబాదరా పరుగెత్తాడు వామనరావు ఆఫీసరు వారి రాకవిని. సగందూరం వచ్చినతర్వాత, తాళం చెవులసంగతి గుర్తుకువచ్చి 'త్వరగా తెమ్మని' ఓ జంఘాలుణ్ణి ఉరికించాడు ఇంటికి.

ఆఫీసరుకూడా నవ్వు ఆగలేదు రొప్పుతూ వస్తున్న వామనరావునూ, అతని లంబోదరాన్నీ చూసేసరికి.

తనిఖీకి వచ్చిన ఆ అధికారి ఆఫీసులో అడుగు పెట్టేడో... లేదో పెద్దముల్లు పన్నెండు మీద నుంచి గభాలున ఆరుమీదికి పడి నాలుగున్నర అయి కూర్చుంది టైమ్. ఆ గారడీకి నివ్వెరపోయాడు ఆఫీసరు.

"అది మన జిల్లాబోర్డు గడియారమేనండీ! ఉత్త దారంతో కడితే తెగిపోతుందేమోనని... ట్వయిన్ దారంతో బిగించి కట్టేంసార్! ఆ పెద్దముల్లు కాస్త పైకెక్కితే చాలు...కైపెక్కినట్టు తూలుతుందండీ!"—ఆ దృశ్యాన్ని సమర్థించాడు ఎప్పుడూ చమత్కారంగా మాట్లాడే వామనరావు.

"మిగతా టీచర్లేరీ...టైమ్ కానిదే బడి ఎందుకు వదిలారు?"—టీచర్స్ రిజిష్టర్ చూస్తూ అడిగేడు ఆఫీసరు.

ఏం సమాధానం చెప్తాడోనని గోడచాటున నక్కిన పంతుళ్ళు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

"పంతుళ్ళా...శుక్రవారం ఉండరండీ! రెండింటికే వదిలేశాలెండి బడి!"—అబద్ధం చెప్పే అలవాటులేని వామనరావు అసలు సంగతి బయట పెట్టేడు.

బయట పొంచి కూర్చున్న దొంగలంతా చచ్చాంరా బాబూ అనుకొని బిక్కుబిక్కుమంటూ మొగమొగాలు చూసుకొన్నారు.

"ఎంతమంది పిల్లలున్నారు స్కూల్లో...?"—వివరాలడుగుతూ రికార్డు తిరగేసి ఏదో వ్రాసుకుంటున్నాడు ఆఫీసరు.

"రిజిష్టరులో పేర్లెక్కినవాళ్ళు నూటయాభై మంది. సగటు హాజరు అరవై దాకా ఉండొచ్చు. అంతకంటె రారండీ యీవూళ్ళో! పిల్లల్ని పంపించండయ్యా...ఊరికే ప్యాసయి పోతారంటే—ఒక్కడూ పంపడే! పైగా పోవయ్యా బాపనయ్యా! పేడేసుకొంటే ఎరువుకన్నా వస్తది... చదవేస్తే యేంవస్తదిలే ఫో...పోవయ్యా అంటారండీ!"

చెప్పే విషయంకన్నా, రసవత్తరంగా ఉన్న వామనరావు మాటలు ఆఫీసరుకు నచ్చి, అందరితో పాటు తనూ నవ్వి, 'కాస్త డోనర్లని పిలిపించం'డని నాగరికంగా ఆజ్ఞాపించాడు ఆఫీసరు.

* * *

తలగుడ్డలు చుట్టుకొని, చేతులు కట్టుకొని డోనర్లంతా హాజరయ్యారు. పరిచయం మొదలెట్టేడు ఒక్కొక్కర్నీ చూపిస్తూ వామనరావు.

"ఈయన పేరు కోటయ్య. ఈ స్కూలు ప్యూను కూడా లెండి. ముప్ఫయి రూపాయిల ఉద్యోగం ఈ దేశంలో గొప్పగనుక ఏదో తంటాలు పడుతున్నాడు, మాంచి పలుకుబడిగల మనిషి. ఈయన మొఖం చూస్తే చాలు అయిదు రూపాయిల ధర ఆరు చెప్తారు. నేతికి వచ్చిన ఈ పెద్ద మనిషిని పంతుళ్ళ ప్రతినిధిగా లెక్కగట్టి ఎక్కువ లాగాలని చూస్తారు. అంత డిమేండుగల మనిషి! ఈయన ఒక డోనరు."

వామనరావు ధోరణికి నవ్వు పొంగి పెదవుల దాకా వచ్చింది ఆఫీసరుకు.

"చెన్నడండీ వీడి పేరు. కులానికి హరిజనుడైనా పంచాయతీబోర్డు వైస్‌ప్రెసిడెంటు. స్కూలు నైట్ వాచరూ, స్వీపరూ, గార్డెనరూ, సర్వం ఇతగాడే. 'సిటిజన్ షిప్ ప్రాక్టికల్స్' పుణ్యమా అని పిల్లలే క్లాసురూములు ఊడ్చుకొంటూంటే అప్పుడప్పుడూ సూపర్వైజర్‌కు వచ్చి దర్శనమిస్తాడు నాకు! ఈయన ఇంకో డోనరు."

ఈసారి నవ్వాపుకోలేక పకపక నవ్వేశాడు ఆఫీసరు. హెడ్మాష్టరు నోటిగుండా వచ్చిన తమ పొగడ్తలు విని ప్యూనూ, నైట్‌వాచరూ తమ ఘనతకు ఉబ్బి తబ్బిబ్బయి ఆఫీసరువారితోపాటు తామూ నవ్వేశారు.

"ఈయన పన్నులు వసూలుగాని ఈ ఊరి పంచాయతీబోర్డు ప్రెసిడెంటు. ఇదిగో ఈయనేమో ఈ వూరి నాటువైద్యులు, భిషగ్రత్న బిరుదాంకితులు. వీరి చేదుమాత్రలే వైకుంఠయాత్రల్ని అరికట్టి ఆపదలో ఆదుకొంటాయి. వీరు నలుగురే ఈ స్కూలు డోనర్లు."

అంతా వంగివంగి దణ్ణాలు పెట్టేరు ఆఫీసరు వారికి.

"ఏమయ్యా, స్కూలు బిల్డింగేదీ?" మూడు సంవత్సరాలక్రితం వ్రాసిన బాండును గుర్తుకు తెచ్చేడు ఆఫీసరు.

ఎదురుగా ఉన్న సత్రంవైపు చూపించాడు ప్రశ్న సరిగ్గా అర్థంగాక ప్రెసిడెంటు.

"సత్రంలో స్కూలు సంగతి వారికి తెలుసులే. కొత్తబిల్డింగయ్యా వారడిగేదీ!" వామనరావు వివరించాడు ఆఫీసరువారి మాటను.

"పునాదులు తీశామండి!" మూడేళ్ళనాడు తీసిన పునాదుల్నే మళ్ళా చూపించారు డోనర్లు, వందగజాల దూరంలో కన్పిస్తూన్న సగం పూడిపోయిన కందకాలవైపు.

ఆఫీసరువారు విసుక్కున్నారు. ఇట్లయితే స్కూలు ఎత్తేస్తామని ధాం... ధూం అని కేకలేసి, ఆతిథ్యం స్వీకరించమని వెంటబడినకొద్దీ మాట్లాడకుండా జీపు ఎక్కి తుఱ్ఱుమన్నాడు.

* * *

ఆ రోజు పంతుళ్ళంతా హుషారుగా వున్నారు. భేదాభిప్రాయాలు ఎటుపోయాయో, ఆంజనేయస్వామి కోవెలదగ్గర వనభోజనం చేసుకొని వచ్చిన పాటలన్నీ పాడుకొన్నారు. ఉదయం టపాలో వచ్చింది ట్రాన్స్‌ఫర్ ఆర్డర్. ఆ స్కూల్లో ఉన్న పంతుళ్ళందర్నీ, హెడ్మాష్టర్‌తో సహా పనిష్మెంట్ క్రింద తలో చోటికి ట్రాన్స్‌ఫర్ చేశారు.

"తంతే గారెలబుట్టలో పడ్డట్టయింది" ఊరు దగ్గర చేరినందుకు గంతేసి అరిచాడు ఆర్డరు చూసుకొని నారాయణ.

"మాంచి కమ్మటూళ్ళో పడ్డాను. కావల్సినన్ని ట్యూషన్లు. పైగా రైల్వేస్టేషన్ కూడా!" సంతోషానికి మేరలేదు ఫస్టు అసిస్టెంటు దాసుకు.

"ఉద్యోగ వ్యవహారములలో శుభవార్త... ప్రయాణము" అదివరకే అండర్‌లైన్ చేసి ఉంచిన ఆదివారం పత్రిక వారఫలాన్ని చూపించాడు శాస్త్రి.

"నా బొంద నా కెందుకు ట్రాన్స్‌ఫర్! కృష్ణా రామా అనుకుంటూ ఈ రెండేళ్ళ సర్వీసూ ఇక్కడే గడిపి రిటైరయ్యేవాణ్ణి! పనీ పాటూ లేదుగా యిక్కడ. ఎంత విశ్రాంతి! ఏమి హాయి!"—తన ఒక్కడికే కష్టంవచ్చి పడిందని గునుసుకొంటూ పరామర్శించాడు తోటి పంతుళ్ళందర్నీ వామనరావు. ★